సాక్షి
మంచిర్యాల
సోమవారం । 6 । అక్టోబర్ । 2025



భీం ఆశయం నెరవేరేదెన్నడో..!

జల్.. జంగల్.. జమీన్ నినాదంతో పోరాడి అసువులు బాసిన కుమురంభీం ఆశయం నెరవేరడం లేదు. ఆదివాసీగిరిజనులు నేటికీ కనీస సౌకర్యాలకు నోచుకోక ఇబ్బంది పడుతున్నారు. 8లో▸



పత్తి రైతు కుదేలు

అధిక వర్షాల కారణంగా పత్తి మొక్కల ఎదుగుదలపై ప్రభావం పడింది. ఆకు మచ్చ, పండాకు తెగుళ్లు ఎక్కువై పూత, కాత సరిగా రాక రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0 /24.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

అతివల ఆరోగ్యానికి రక్ష

- జిల్లాలో స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్
- 16 రోజులు కొనసాగిన ప్రత్యేక వైద్యశిబిరాలు
- వైద్య నిపుణులతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- వివిధ వ్యాధుల గుర్తింపు ప్రక్రియ పూర్తి
- కొనసాగుతున్న మందుల పంపిణీ, వైద్యసేవలు

మంచిర్యాలటౌన్: జిల్లాలో నిర్వహించిన వ్యాధుల నిర్ధారణ ప్రక్రియ పూర్తయింది. వైద్యశిబిరాల్లో పరీక్షలు చేయించుకున్న వారిలో వివిధ వ్యాధులున్న వారిని వైద్యులు గుర్తించారు. జాతీయ పోషణ మాసాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి మాతృ వందన పథకం కింద ప్రసూతి ప్రయోజనాల పంపిణీ, స్వస్థ్‌నారి సశక్త్ పరివార్‌లో భాగంగా గత నెల 17నుంచి ఈ నెల 2వరకు ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించి ప్రత్యేక వైద్య నిపుణుల ద్వారా 16రోజుల పాటు జిల్లాలో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు, ఐదు బస్తీ దవాఖానాలు, మూడు సామాజిక ఆరోగ్యకేంద్రాలు (సీహెచ్‌సీలు), మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

వ్యాధులు గుర్తించి.. సేవలందించి..

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వైద్యశిబిరాల్లో మహిళలతోపాటు పురుషులకూ పరీక్షలు నిర్వహించారు. అనుమానితుల నుంచి రక్తనమూనాలు సేకరించారు., టీహబ్‌కు పంపించి వాటి ఫలితాలను ఆధారంగా చేసుకుని మందులు అందించారు. మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ప్రత్యేకంగా చేపట్టిన ఈ వైద్యశిబిరాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరినట్లయింది. వివిధ వ్యాధులున్న వారిని గుర్తించగా వారికి సకాలంలో మందులు, వైద్యసేవలు అందించే అవకాశమేర్పడింది.

86 ప్రత్యేక శిబిరాల ద్వారా..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 86 క్యాంపులు నిర్వహించగా, మహిళలకు ప్రత్యేకంగా స్క్రీనింగ్ చేపట్టారు. చెవి, ముక్కు, గొంతు, కళ్లు, దంత సమస్యలు, రక్తపోటు, డయాబెటిస్, ముఖద్వారా క్యాన్సర్లు, గర్భిణులకు రక్తహీనత, టీబీ, సికిల్‌సెల్, ఎనీమియా తదితర వ్యాధులతో బాధ పడేవారిని ప్రత్యేక వైద్యశిబిరాల్లో గుర్తించారు. మాతృవందనంలో పేర్లు నమోదు చేసుకున్న వారికి సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించి వ్యాధిని గుర్తించి చికిత్స అందించారు. వీరి కోసం జిల్లావ్యాప్తంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రైవేట్, ప్రభుత్వ వైద్యుల సహకారంతో నిర్వహించిన 86 వైద్యశిబిరాల్లో స్పెషలిస్ట్ వైద్యులతోనే పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాలు నిర్వహించడంతోనే మహిళలు, పురుషుల్లో బీపీ, షుగర్, రక్తహీనత, క్యాన్సర్, సికిల్‌సెల్, టీబీ వ్యాధులు గుర్తించారు. టీబీ వ్యాధి బారిన పడ్డ వారికి పోషకాహార కిట్లు కూడా అందించారు.

ఇదీ ప్రభుత్వ లక్ష్యం..

వైద్యశిబిరాల్లో భాగంగా వ్యాధులపై అవగాహన కల్పించారు. మహిళలు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం సూచనలు చేశారు. నిత్యావసరాల్లో 10శాతం చక్కెర, వంట నూనెలు తగ్గిస్తే ఊబకాయాన్ని తగ్గించుకోవచ్చని ప్రోత్సహించారు. స్థానికంగా లభించే ఆహారం గురించి మహిళలకు వివరించారు. శిశు సంరక్షణ, శిశు, బాలల ఆహార పద్ధతుల గురించి తెలిపారు. ఆరోగ్య పోషకాహారంపై అవగాహన కల్పించారు.



పాతమంచిర్యాల అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యశిబిరానికి హాజరైన వైద్యులు (ఫైల్)

జిల్లాలో స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన వైద్యపరీక్షల వివరాలు

వైద్యశిబిరాలు	86	క్యాన్సర్ లక్షణాలున్న పురుషులు	1,373
పరీక్షలు చేయించుకున్న స్త్రీలు	28,900	రక్తహీనత మహిళలు	3,288
పరీక్షలు చేయించుకున్న పురుషులు	17,889	రక్తహీనత పురుషులు	1,169
బీపీ నిర్ధారణ మహిళలు	14,078	టీబీ నిర్ధారణ మహిళలు	58
బీపీ నిర్ధారణ పురుషులు	6,610	టీబీ నిర్ధారణ పురుషులు	48
షుగర్ నిర్ధారణ మహిళలు	13,107	సికిల్ సెల్ మహిళలు	8
షుగర్ నిర్ధారణ పురుషులు	5,795	సికిల్‌సెట్ పురుషులు	2
క్యాన్సర్ లక్షణాలున్న మహిళలు	5,672		

చికిత్స అందిస్తున్నాం



జిల్లావ్యాప్తంగా ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబం కార్యక్రమాన్ని గత నెల 17నుంచి ఈ నెల 2వరకు అన్ని ఆరోగ్యకేంద్రాల్లో నిర్వహించాం. వేల సంఖ్యలో ప్రజలు శిబిరాలకు హాజరై వైద్యపరీక్షలు చేయించుకున్నారు. వివిధ వ్యాధులున్న వారిని గుర్తించి మందులు అందించాం. వారికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. మెరుగైన వైద్యం అవసరమైనవారిని పెద్దాస్పత్రులకు రెఫర్ చేశాం.

– అనిత, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

న్యూస్‌రీల్

చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు



పట్టుబడిన నగదుతో ఎస్సై రాజేందర్

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్రలోని సిరోంచ తాలూకా రేగుంట గ్రామానికి చెందిన గడిపల్లి సాయి అనే యువకుడు అనుమతి లేకుండా రూ.లక్షా 90వేల నగదును కారులో తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నగదును సీజ్ చేసి తహసీల్దార్ రాఘవేందర్‌రావుకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్ శ్యాం తదితరులున్నారు.

రేపు కబడ్డీ ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఈనెల 7న అండర్–19 జిల్లా, ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఐఈవో అంజయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ చదువుతున్న 19 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు బోనఫైడ్, ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ మెమో తీసుకురావాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఎస్జీఎఫ్–19 సెక్రటరీ బాబురావును సంప్రదించాలని సూచించారు.

గిరిజనుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న ఆదివాసీలు

దండేపల్లి: మండలంలోని దమ్మన్నపేట, మామిడిగూడెం గ్రామాల ఆదివాసీ గిరిజనులు ఆదివారం తాళ్లపేట అటవీ రేంజీ కార్యాలయం వద్ద కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. అటవీశాఖ అధికారులు తమపై కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. రేంజ్ అధికారి సుష్మారావు అందుబాటులో లేకపోవడంతో విషయం తెలుసుకున్న డీఆర్వో సాగరిక అక్కడికి చేరుకుని గిరిజనులకు నచ్చజెప్పగా వారంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న రితీశ్‌రాథోడ్

జన్నారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో పార్టీ మండలాధ్యక్షుడు మధుసూదన్‌రావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు గెలిచేవారినే ఎంపిక చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రధాని మోదీ పాలన గురించి ప్రజలకు వివరించాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ హయాంలో బిల్లుల రాక పలువురు సర్పంచులు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలున్నాయని ఆరోపించారు. హామీలు నెరవేర్చకుండా దొంగనాటకాలు ఆడుతున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని సూచించారు. జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, నాయకులు చంద్ర, రమేశ్, తిరుపతినాయక్, గోపాల్ తదితరులున్నారు.

కళాకారులకు పెన్షన్ ఇవ్వాలి



సమావేశానికి హాజరైన కళాకారులు

దండేపల్లి: 60 ఏళ్లు దాటిన నాటక, భజన కళాకారులకు ప్రభుత్వం నెలకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని నాటక, భజన కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటాచారి డిమాండ్ చేశారు. మండలంలోని రెబ్బనపల్లిలో మండలంలోని వివిధ గ్రామాల కళాకారులతో ఆదివారం సమావేశమై మాట్లాడారు. సినిమాల రాకతో కళాకారులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తంజేశారు. ప్రసిద్ధ పుణ్య క్షేత్రాల్లో భజన కళాకారులకు నిత్య భజనలకు అనుమతినిచ్చి కనీస వేతనం ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కళాకారులంతా ఐక్యతతో ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం రెబ్బనపల్లి, ముత్యంపేట, కొర్విచెల్మ, చింతపల్లి, కన్నెపల్లి, గూడెం, రంగంపల్లె, నంబాల, గ్రామాల కమిటీలు ఏర్పాటు చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రమేశ్‌చారి, ముత్యం మల్లేశ్, పింగళి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్‌లో జోరు వర్షం



తాండూర్ ఐబీ ప్రాంతంలో కురుస్తున్న వాన

తాండూర్: మండలంలో ఆదివారం జోరు వాన కురిసింది. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై దాదాపు రెండు గంటల పాటు వర్షం కురవడంతో కాలువలు పొంగి ప్రవహించాయి. భారీ వర్షం కురవడంతో పత్తి పంటకు తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

జలం.. కలుషితం



బతుకమ్మలతో నిండిన పోశమ్మ చెరువు

- రంగుమారిన చెరువు నీరు
- వ్యాపిస్తున్న తీవ్ర దుర్గంధం
- ఇబ్బందుల్లో పట్టణ ప్రజలు

బెల్లంపల్లి: చెరువుల్లోని జలం కలుషితమవుతోంది. సింగరేణి పవర్ హౌస్ అవసరాల కోసం సుమారు ఎనిమిది దశాబ్దాల క్రితం బెల్లంపల్లిలో గొలుసుకట్టుగా మూడు చెరువులు నిర్మించారు. గురిజాలకు వెళ్లే మార్గంలో గ్రామ దేవత పోశమ్మ గుడి ఉంది. దీనిని ఆనుకుని నిర్మించిన జలాశయాలకు పోశమ్మ చెరువులుగా పేరు స్థిరపడి పోయింది. రెండు దశాబ్దాల క్రితం బెల్లంపల్లిలోని సింగరేణి పవర్ హౌస్‌ను కొందరు సింగరేణి అధికారులు అనాలోచిత విధానాలతో మూసివేశారు. దాని సామగ్రిని ముంబైకి చెందిన ఓ ప్రైవేట్ కంపెనీకి స్క్రాప్ కింద కారు చౌకగా విక్రయించారు. దీంతో అప్పటి నుంచి పోశమ్మ చెరువుల నీళ్లు సింగరేణికి వినియోగించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి దుస్తులు శుభ్రం చేయడానికి, అంత్యక్రియలు నిర్వహించాక స్నానాలు చేయడానికి మాత్రమే పురప్రజలు వినియోగిస్తున్నారు. ఎంత తీవ్రమైన వేసవిలోనైనా చెరువుల్లోని జలాలు అడుగంటడంలేదు. మూగజీవాల దాహార్తిని తీర్చుతున్నాయి. గంగపుత్రులు ఈ చెరువులో కొంతకాలంగా చేపల పెంపకం చేపడుతున్నారు. ఇన్ని రకాలుగా ఉపయోగపడుతున్న పోశమ్మ చెరువుల నీళ్లు క్రమంగా కలుషితమవుతున్నాయి. పురప్రజలకు దుర్గంధం పంచుతున్నాయి.

కలుషితానికి కారణాలివే..

గణేశ్ నవరాత్రులు ముగిశాక విగ్రహాలను పోశమ్మ రెండో చెరువులో నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. చాలావరకు రసాయనిక పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేస్తుండడంతో నీరు కలుషితమవుతోంది. ఇలా ఎన్నో ఏళ్లుగా చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు. ఒక్కసారి కూడా చెరువు పూడిక తీసిన దాఖలాలు లేవు. దీంతో చెరువు నుంచి వచ్చే దుర్గంధం భరించలేక పుర ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పోశమ్మ పెద్ద చెరువు కట్ట చివరలో బతుకమ్మ ఘాట్ నిర్మించారు. ఈ ఘాట్ వద్ద సద్దుల బతుకమ్మ రోజు బతుకమ్మలు నిమజ్జనం చేస్తున్నారు. సహజసిద్ధంగా పూసిన పూలతో పాటు రంగులద్దిన పూలనూ బతుకమ్మలు పేరుస్తుండటంతో అవి నీటిలో కొంతకాలం పాటు మురిగి జల కాలుష్యాన్ని పెంపొందిస్తున్నాయి. గత నెలలో నిమజ్జనం చేసిన బతుకమ్మలు ప్రస్తుతం ఘాట్‌వద్ద కుప్పలుగా పేరుకుపోయాయి. ఇలా కొన్నాళ్ల నుంచి నిమజ్జనం చేస్తున్న బతుకమ్మలన్నీ అడుగు భాగంలో ఉండి పోవడంతో నీరు కలుషితమవుతోంది. పోశమ్మ చెరువు నీళ్లు ఒకప్పుడు పురప్రజల తాగునీటి అవసరాలు తీర్చగా ప్రస్తుతం కలుషితమై ఎందుకూ పనికిరాకుండా తయారయ్యాయి.



పోశమ్మ రెండో చెరువులో రంగు మారిన నీళ్లు

పట్టించుకునేవారేరి?

వినాయకుడి విగ్రహాలు, బతుకమ్మల నిమజ్జనాలతో పోశమ్మ చెరువుల నీళ్లు నిర్మలత్వాన్ని కోల్పోతున్నాయి. రంగుమారి దర్శనమిస్తున్నాయి. అసలు స్నానం చేయడానికి కూడా పనికి రావని పురప్రజలు చెబుతున్నారు. అంతగా నీళ్లు కలుషితమై పోతున్నా ఎవరూ చెరువుల ముఖం చూసిన దాఖలాలు లేవు. ఏడాదికి రెండుసార్లు నిమజ్జనాల సందర్భాల్లో మినహా ఎప్పుడూ పట్టించుకున్న పాపాన పోవడంలేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా జీవాలు, ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నీటి కాలుష్యం ఏర్పడకుండా తగినచర్యలు చేపట్టాలని పురప్రజలు కోరుతున్నారు.

‘గీత’ గీయకున్నా.. రాత మారింది

- మంచిర్యాల సొసైటీలో అక్రమాలు
- అనర్హులకు సంఘంలో సభ్యత్వం
- దొడ్డిదారిన పెన్షన్ పొందుతున్న వైనం

మంచిర్యాలక్రైం: మంచిర్యాల కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘంలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. కల్తీ కల్లు దందాతోపాటు సభ్యత్వం పేరిట రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. చెట్టు ఎక్కక పోయినా.. గీత గీయక పోయినా అనర్హులకు సభ్యత్వం కల్పిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇదంతా సంఘంలోని ఓ బడా నాయకుని కనుసన్నల్లో జరుగుతున్నట్లు తెలిసింది. జిల్లా వ్యాప్తంగా 883మంది కల్లు గీత కార్మికులున్నారు. ఒక్క మంచిర్యాల సొసైటీలో 39మంది ఉండగా ఇందులో 30మందికి పెన్షన్ అందుతోంది. ఇందులో సగానికి పైగా అనర్హులుండడం గమనార్హం.

స్థానికంగా లేని 44మందికి సభ్యత్వం

నిబంధనల ప్రకారం తాటిచెట్టు ఎక్కితేనే సొసైటీలో సభ్యత్వం ఇవ్వాలి. 30 మందితో ప్రారంభమైన మంచిర్యాల సొసైటీ ప్రస్తుతం వందమందికి చేరింది. కానీ, అధికారుల రికార్డుల ప్రకారం 39మంది సభ్యత్వం ఉన్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది కొత్తగా స్థానికంగా లేని 44 మందికి సభ్యత్వం ఇచ్చినట్లు సొసైటీ సభ్యులే ఆరోపిస్తున్నారు. ఆదిలాబాద్, జగిత్యాల తదితర ప్రాంతాల్లో వైద్యవృత్తిలో కొనసాగుతున్న వారికి, మైనర్లకు, అర్హత లేనివారికి సభ్యత్వం కల్పించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లా వ్యాప్తంగా అనర్హులెందరో!

సొసైటీలో సభ్యత్వం ఉంటే గీత కార్మికుడిగా గుర్తింపు ఉన్నట్లే. 50 ఏళ్లు నిండిన గీత కార్మికుడికి అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 2015 నుంచి రూ.2,016 పెన్షన్ ఇస్తోంది. మంచిర్యాల సొసైటీలో 30మంది పెన్షన్ పొందుతుండగా ఇందులో సగానికి పైగా అనర్హులే ఉన్నట్లు తెలిసింది. ఈ లెక్కన ఒక్కొక్కరు 11 ఏళ్ల నుంచి ఇప్పటివరకు రూ.2,65,320 పెన్షన్ పేరిట ప్రభుత్వ ఖజానాను దోచుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 883 మంది గీత కార్మికులు పెన్షన్ తీసుకుంటుండగా, ఇందులో ఎంతమది అనర్హులున్నారో విచారణ చేపడితే వెలుగులోకి వస్తుంది. ఈ విషయమై జిల్లా ఎక్సైజ్ అధికారిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించకపోడం గమనార్హం.



జిల్లా కేంద్రంలోని కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం కార్యాలయం

ఓపెన్ ప్లాట్లు.. జనం పాట్లు

- పందులు, దోమలకు ఆవాసాలు
- ఇబ్బందుల్లో సమీప నివాసాలవారు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

నస్పూర్: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోగల ఓపెన్ ప్లాట్లు చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, మురుగునీటితో నిండి దోమలు, ఈగలు, పందులకు ఆవాసాలుగా మారాయి. ప్లాట్లు మురికి కూపాలను తలపిస్తున్నాయి. నస్పూర్‌లో ఐడీవోసీ భవన సముదాయం ఏర్పాటు కావడంతో జిల్లా కేంద్రం చుట్టు పక్కల భూములకు డిమాండ్ ఏర్పడింది. దీంతో చాలామంది వారి భవిష్యత్ అవసరాల కోసం ప్లాట్లు కొనుగోలు చేసి పెట్టుకున్నారు. భవిష్యత్‌లో ఇళ్లు నిర్మించుకోవాలనేది వారి ఆలోచన. కొనుగోలు చేసిన ప్లాట్లకు ఎలాంటి రక్షణ గోడలు నిర్మించకుండా వదిలివేస్తున్నారు. దీంతో చుట్టుపక్కలవారు ఈ ఖాళీ ప్లాట్లను చెత్తకుండీలుగా వినియోగిస్తున్నారు. తమ ఇళ్లల్లోని చెత్తను ఖాళీ ప్లాట్లలో పడవేస్తున్నారు. పట్టణంలో చాలాచోట్ల ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లలోనే ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేశారు. సదరు ప్లాట్లలో ఇళ్లు నిర్మించుకున్న వారికి సరైన డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరంతా ఓపెన్ ప్లాట్లలోకి చేరుతోంది. దీంతో కాలనీల్లో పలువురి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ప్లాట్ల చుట్టూ ఎలాంటి రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోవడంతో వాటిలో పిచ్చిమొక్కలు పెరిగి తొలగించడం కష్టతరమవుతోంది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చాలా కాలనీల్లో దాదాపు ఇదే దుస్థితి నెలకొంది. ఖాళీ ప్లాట్లలో మురుగునీరు, పిచ్చిమొక్కలు ఉండడంతో దోమలు, ఈగలు పెరిగిపోతున్నాయి. ప్లాట్లను పందులు తమ ఆవాసాలుగా మార్చుకున్నాయి. వీటి ద్వారా పలువురు రోగాల బారిన పడుతున్నారు. ఎలాంటి రక్షణ గోడలు నిర్మించని ప్లాట్ల యజమానులను గుర్తించి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేసి జరిమానా విధించాలని పలువురు పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రక్షణ గోడలు నిర్మించని ప్లాట్ల యజమానులపై మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వాటితో ఇబ్బంది పడుతున్న పట్టణవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



నస్పూర్‌లో జనావాసాల మధ్య మురుగునీరు, పిచ్చిమొక్కలతో నిండిన ఓపెన్ ప్లాట్



ఓపెన్ ప్లాట్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం

చర్యలు చేపట్టాలి



మేము నస్పూర్ టవర్స్ వద్ద నివాసముంటున్నాం. మా ఇంటి పక్కన ఖాళీ ప్లాట్ ఉంది. చుట్టు పక్కల వారు అందులో చెత్త పడవేస్తున్నారు. డ్రెయిన్ వాటర్ కూడా అందులోనే చేరి నిల్వ ఉంటోంది. పిచ్చి మొక్కలు కూడా పెరిగాయి. చుట్టు పక్కల వారితో తరచూ గొడవలవుతున్నాయి. వాటిలో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నాం. అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

– సతీశ్‌కుమార్, నస్పూర్

అడ్డగోలుగా చెట్ల నరికివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలతో పాటు హాజీపూర్ మండలంలో పచ్చని చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. గతంలో రాపల్లిలో, ఇటీవల నర్సింగాపూర్‌లో ఆదివారం గుడిపేట, నంనూర్‌లో రహదారి పక్కనున్న చెట్ల కొమ్మలు అడ్డగోలుగా నరికివేశారు. ఇందుకోసం విద్యుత్ సరఫరా నిలిపివేశారు. నర్సింగాపూర్‌కు వెళ్లే రహదారిలో గతంలో హరితహారంలో భాగంగా నాటిన చెట్లు ఏపుగా పెరగడంతో వాటిని కొంతమంది యంత్రంతో ఒక్క పూటలోనే గుర్తు పట్టకుండా నరికేస్తున్నారు. కొద్దికాలంగా ఈ చెట్లు, చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్నాయనే సాకుతో విద్యుత్ శాఖ పేరు చెప్పి గుర్తు తెలియని వ్యక్తులు యంత్రాలతో కొట్టి వేస్తున్నారు. స్థానికంగా ఉన్న ఓ నాయకుడు ఈ చెట్ల కొమ్మలు, చెట్లను అడ్డగోలుగా నరికిస్తూ స్థానికంగా ఉన్న ఓ బ్రిక్ కంపెనీకి అమ్ముకుంటూ రూ.లక్షలు గడిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. ఇంత జరుగుతున్నా ఎవరూ పట్టించుకోడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చెట్ల నరికివేతను అడ్డుకోవాలని కోరుతున్నారు.



గుడిపేటలో నరికివేతకు గురైన రోడ్డు పక్కనున్న చెట్లు

పద్మశాలీలు రాజకీయంగా రాణించాలి

దండేపల్లి: పద్మశాలీలు రాజకీయంగా రాణించాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు గాదాసు బాపు సూచించారు. స్థానిక పద్మశాలీ భవనంలో నూతనంగా ఎన్నుకోబడిన దండేపల్లి మండల పద్మశాలీ సంఘం కమిటీతో ఆదివారం ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం ఉన్న చోట ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్లుగా పోటీ చేయాలని సూచించారు. రాజకీయంగా ఎదిగినప్పుడే సమాజంలో గుర్తింపు వస్తుందని తెలిపారు. పద్మశాలీ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వంగ శంకరయ్య, ఎనగందుల సత్యం, రాష్ట్ర మహిళ కార్యదర్శి మంగ, నాయకులు నాగరాజు, వీరస్వామి, కుటుంబరావు, చిన దుబ్బయ్య, శంకరయ్య, కిషన్, చిలుకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న బాపు

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత



తాడిహత్నూర్‌లో పట్టుకున్న బియ్యం

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్‌లో అక్రమంగా విక్రయిస్తున్న పీడీఎస్ బియ్యం ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై అఖిల్ తెలిపారు. కోటగిరి విశాల్, చింతావార్ సత్య నారాయణ పీడీఎస్ బియ్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి 2.80 కిలోల బియ్యం స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఉచిత బియ్యం అక్రమంగా తరలించినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బైక్ కొనివ్వలేదని విద్యార్థి ఆత్మహత్య



మణికంఠ మృతదేహం

లక్సెట్టిపేట: బైక్ కొనివ్వలేదని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని క్లబ్ రోడ్‌కు చెందిన రాథోడ్ మణికంఠ (20) మంచిర్యాలలోని కళాశాలలో ఐటీఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పది రోజులుగా బైక్ కొనివ్వాలని తల్లిదండ్రులను అడుగుతున్నాడు. ఈ నెల 4న సాయంత్రం బైక్ కొనివ్వాలని పట్టుబట్టడంతో కొన్నిరోజుల తర్వాత కొనిస్తామని తల్లిదండ్రులు సర్దిచెప్పారు. అయినా వినకుండా ఇంట్లోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి దారాసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు ...



వినోద్ (ఫైల్)

లక్ష్మణచాంద: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కనకాపూర్ గ్రామానికి చెందిన తుడిగని వినోద్ (35) కొంతకాలంగా మద్యానికి బానిసై ఖాళీగా తిరుగుతున్నాడు. రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 3న మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుని భార్య శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న లారీ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని బీర్సాయిపేట గ్రామ సమీపంలో ఆదివారం గుంతను తప్పించబోయి లారీ చెట్టును ఢీ కొట్టింది. జన్నారం నుంచి ఉట్నూర్ వైపు బయలుదేరిన లారీ మంచిర్యాల–ఆదిలాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న గుంతను తప్పించబోయి ప్రమాదవశాత్తు చెట్టును ఢీ కొట్టింది. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయట పడ్డారు. ఇటీవల ఓ ప్రైవేటు బస్సు సైతం ఈ గుంతలో పడిపోవడంతో ముందు టైర్లు ఊడిపోయిన సంఘటన నెలకొంది. పెద్ద ప్రమాదం సంభవించి ప్రాణనష్టం జరగకముందే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఒకరిపై పోక్సో కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలిక(11)తో అసభ్యంగా ప్రవర్తించిన ఫయ్యాజ్ ఖాన్‌పై ఆదివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. నాగ్‌పూర్‌కు చెందిన ఫయ్యాజ్ అదే కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. బాలిక ఇంట్లో ఎవరూలేని సమయంలో లోనికి చొరబడి అసభ్యంగా ప్రవర్తించాడు. స్థానికులు గమనించి తల్లికి సమాచారం ఇవ్వడంతో నిందితుడు పరారయ్యాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి సాగు చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

లింగాపూర్: సిర్పూర్(యూ) మండలం కోహినూర్(కే) గ్రామంలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై గంగారం తెలిపారు. మేస్రం జుగాదిరావు చేనులో 6, మేస్రం గంగారాం చేనులో 4 మొక్కలను గుర్తించినట్లు ఆయన తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి రిమాండ్

ఇంద్రవెల్లి: చోరీ కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. మండలంలోని మోహన్‌సింగ్‌తండాకు చెందిన రవిబాను అదేగ్రామంలో కిరాణ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 4న రాత్రి షాపు బంద్ చేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం వచ్చి షాపు తెరిచి చూడగా షటర్ కొంచెం పైకి లేచి ఉంది. అనుమానం వచ్చి లోనికి వెళ్లి చూడగా కౌంటర్‌లో ఉంచిన రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా మడండి రమేశ్, కనోడే విఠల్‌ను అరెస్ట్ చేసి విచారించడంతో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

భీం ఆశయం నెరవేరేదెన్నడో!

'జల్, జంగల్, జమీన్' నినాదంతో భూమి, నీరు, అడవిపై ఆదివాసీలకు హక్కులకోసం నిజాం ప్రభుత్వంతో జరిపిన పోరాటంలో అసువులు బాసిన గిరిజనుల ముద్దుబిడ్డ కుమురంభీం. ఆయన మరణించి 85 ఏళ్లు కావస్తున్నా ఆశయం మాత్రం ఇప్పటికీ నెరవేరలేదు. నేటికీ గిరిజనులు తాగు, సాగునీరు, రోడ్డు సౌకర్యం, సాగు చేస్తున్న భూములకు పట్టాలులేక అలమటిస్తున్న పల్లెలు అనేకం ఉన్నాయి. ఈ నెల 7న కుమురంభీం 85వ వర్ధంతి సందర్భంగా కథనం.



ఆదివాసీలు నివాసం ఉంటున్న పెంకుటిండ్లు

- గిరిజన చట్టాలను కాలరాస్తున్న పాలకులు
- 5వ షెడ్యూల్‌కు తూట్లు
- ప్రేక్షక పాత్రలో అధికారులు
- రిజర్వేషన్లతో ఆదివాసీల్లో ఆందోళన

కడు దయనీయం

కెరమెరి(ఆసిఫాబాద్): నాటి నుంచి నేటి వరకు ఆదివాసీల పరిస్థితి కడు దయనీయంగా ఉంది. భూమి, నీరు, అడవిపై ఇంకా హక్కులు రాలేదు. గిరిజన చట్టాలు గిరిజనేతరులకు చుట్టాలవుతున్నాయి. అప్పటి నిజాం సర్కారు ఆదివాసీ భూముల రక్షణకోసం భూ బదలాయింపు చట్టం 1/70 తీసుకువచ్చింది. కానీ అధికార యంత్రాంగం ఆదివాసీల భూముల గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో గిరిజనుల భూములను గిరిజనేతరులు గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమించుకుంటున్నారు. భూ బదలాయింపు నిషేధం ఉన్న షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనేతరుల వలసలు పెరిగి భూముల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోంది. దీంతో గిరిజనులు మళ్లీ అడవిలో చెట్లను నరుక్కుని బతకాల్సిన పరిస్థితులు దాపురించాయి. అందులో కూడా గిరిజనులను బతకనీయకుండా అటవీశాఖ అధికారులు తరిమేస్తున్నారు.

ఉపయోగంలోకి రాని ఐదో షెడ్యూల్

భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ప్రకారం అడవి, భూమి, నీటిపై గిరిజనులకు పూర్తి హక్కులు ఉన్నప్పటికీ నూతన చట్టాలు వాటికి తూట్లు పొడుస్తున్నాయి. 2005లో బిల్లు ప్రవేశపెట్టి హక్కులను కల్పిస్తామని గత ప్రభుత్వాలు చెప్పినా అవి అమలు కాలేదు. ఐటీడీఏ నిధులతో నిర్మించిన కుంటలు, చెరువుల్లో పెంచుతున్న చేపలు, రొయ్యలపై ఆదివాసీలకే హక్కులున్నాయని చట్టాలు చెబుతున్నా వారి గోడు పట్టించుకునే వారు కరువయ్యారు. కొంత కాలంగా వలసలుగా వచ్చినవారు ఎస్టీలుగా చలామని అవుతూ నిజమైన గిరిజనులకు అన్యాయం చేస్తున్నారు.

కనుమరుగవుతున్న జీవోలు

ఆదివాసీల రక్షణ కోసం ఏర్పాటు చేసిన జీవోలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగాలు వందశాతం గిరిజనులకే చెందాలని పొందుపర్చబడ్డ జీవో 3ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఏజెన్సీలోని గిరిజనులకు 50 శాతం మించకూడదని ఉత్తర్వుల్లో పేర్కొంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఫలితంగా ఇటీవల ఉపాధ్యాయ ఉద్యోగాల్లో ఏజెన్సీ, నాన్‌ఏజెన్సీకి సంబంధం లేకుండా గిరిజనేతరులను భర్తీ చేసింది.



జోడేఘాట్‌లోని కుమురం భీం విగ్రహం

రిజర్వేషన్లతో ఏజెన్సీలో గుబులు

5వ షెడ్యూల్ గిరిజన చట్టం ప్రకారం ఏజెన్సీలో గిరిజనేతరులకు రిజర్వేషన్‌లలో అవకాశం ఉండదు. కానీ ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏజెన్సీ ప్రాంతంలోనూ గిరిజనేతరులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించారు. ఈ క్రమంలో 5వ షెడ్యూల్ అమలులో ఉండగా ఇదెలా సాధ్యమని, భవిష్యత్‌లో ఉద్యమ కార్యచరణ చేపట్టనున్నట్లు ఆదివాసీ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

చట్టాలు పకడ్బందీగా అమలు



ఆదివాసీ ప్రాంతాల్లో గిరిజన చట్టాలు, హక్కులు అమలు కావడంలేదు. దీంతో గిరిజన నిరుద్యోగులు, సామాన్య ప్రజలు అన్యాయానికి గురవుతున్నారు. జీవో 3 స్థానంలో మరో జీవో తీసుకువచ్చి ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. 1/70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి. 5వ భూభాగాన్ని రక్షించాలి. – కోవ విజయ్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు, కుమురంభీం ఆసిఫాబాద్

కొలాం వీరుడికి సలాం..!

నిస్సహాయులుగా, నిస్తేజంతో సతమతమవుతున్న కొలాం ఆదివాసీల్లో స్వాతంత్రేచ్ఛను రగిల్చిన ఖ్యాతి కుమురం సూరుకే దక్కుతుంది. రేపు కుమురం సూరు 28వ వర్ధంతిని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్‌లో జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా కథనం.

- జోడేఘాట్‌లో రేపు కుమురం సూరు 28వ వర్ధంతి
- రాష్ట్రం నలుమూలల నుంచి రానున్న కొలాం ఆదివాసీలు



కుమురం సూరు (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్‌కు చెందిన కుమురం చిన్ను, మారుబాయి దంపతులకు 1918లో కుమురం సూరు జన్మించారు. చిన్నతనం నుంచి అందరి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నాడు. గోండు, కొలాం జాతి ప్రజలు వెనుకబడడానికి కారణం నిజాం ప్రభుత్వమేనని గుర్తించి నిజాం నవాబులు, తాబేదారులు, రజాకార్లు కొనసాగిస్తున్న అక్రమాలు, దౌర్జన్యాలను సహించలేకపోయాడు. తన జాతికి ఉక్కు సంకెళ్ల నుంచి విముక్తి కల్పించాలని నిర్ణయించాడు. ఆ సమయంలోనే కుమురంభీం జోడేఘాట్‌కు రావడంతో వారిలో నూతనోత్తేజం నింపింది. కొలాం, గోండులను ఏకంచేసి భీంకు అండగా నిలిచాడు. అలా సమకూరిన బలంతోనే జోడేఘాట్ పరిసరాల్లో 12 గ్రామాలు వెలిశాయి. ఆయా గ్రామాలను ఆనుకుని ఉన్న వంద ఎకరాల భూమిని ఆదివాసీలు సాగు చేస్తున్నారు. అట్టి భూములను నిజాం రజాకార్లు ఆక్రమించేవారు. ఈ విషయమై అప్పటి కలెక్టర్ నిజాం సాహెబ్‌కు మొరపెట్టుకున్న స్పందించలేదు.

జల్, జంగల్, జమీన్

ఈక్రమంలో కుమురంభీం నాయకత్వంలో జల్ జంగల్ జమీన్ నినాదంతో ఉద్యమం ప్రారంభమైంది. ఆదివాసీలపై చిత్రహింసలకు పాల్పడిన నిజాం మిలటరీతో పలుమార్లు యుద్ధం సాగింది. దీంతో 1938–40 లో ఆసిఫాబాద్ తహసీల్దార్ కుమురంభీం ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. భీం జాడ చూపాలని సూరును నిజాం మిలటరీ చిత్రహింసలు పెట్టింది. ఇలా కొన్నాళ్లు సాగిన పోరాటంలో అనేక మంది ఆదివాసీలు ప్రాణాలు కోల్పోయారు. మడావి కొద్దు భీం ఆచూకీ తెలపడంతో నిజాం మిలటరీ కాల్చిచంపింది. అదే పోరాటంలో సూరు కుడి చేయి, కుడి కాలు పోగొట్టుకున్నాడు. తన ప్రాణాలు కాపాడుకునేందుకు సమతుల గుండంలో ఆరు మాసాలు అజ్ఞాతంలో ఉన్నాడు.



జోడేఘాట్‌లోని కుమురం సూరు విగ్రహం

ఆదివాసీ కొలాం క్రాంతివీర్

1975లో ఐటీడీఏ ఏర్పడిన తర్వాత అధికారులతో చర్చించి కుమురంభీం వర్ధంతిని అధికారికంగా నిర్వహించేందుకు సూరు కృషి చేశాడు. 1980లో కొలాం గ్రామాలలో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, కొలాం ఆశ్రమ పాఠశాలల ఏర్పాటుకు కృషి చేశాడు. 1986లో ఐటీడీఏలో కొలాం అభివృద్ధి అధికారిగా సూరును నియమించారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం 'ఆదివాసీ కొలాం క్రాంతివీర్' అనే బిరుదును ఇచ్చింది. ఆ తర్వాత 1997 ఆగస్టు 10న ఆశ్వియుజ పౌర్ణమి రోజున ఆసిఫాబాద్ మండలం శాకన్‌గొందిలో సూరు మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మంగళవారం అధికారికంగా జోడేఘాట్‌లో సూరు 28 వర్ధంతిని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కొలాం ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలిరానున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



రాహుల్ (ఫైల్)

గుడిహత్నూర్: అనుమానాస్పదస్థితిలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లా గుమ్‌గావ్‌కు చెందిన భగ్నూరే రాహుల్ (35)కు మండలంలోని కొల్హారీ గ్రామానికి చెందిన లక్ష్మీబాయితో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. రాహుల్ తన భార్యతో కలిసి ఇక్కడే ఉంటున్నాడు. భార్యతో తరచూ గొడవలు జరుగుతున్నాయని గుమ్‌గావ్‌లో ఉన్న తండ్రి బాలాజీతో ఫోన్‌లో చెప్పేవాడు. శనివారం రాత్రి తండ్రికి ఫోన్‌చేసి తన భార్యతో గొడవ జరిగిందని చెప్పి వెంటనే కట్ చేశాడు. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన వ్యక్తి ఫోన్‌చేసి మీ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం అందించాడు. కోడలు లక్ష్మీబాయి, ఆమె తల్లి షిండే లలితపై అనుమానం ఉందని మృతుని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మహారాష్ట్ర రోడ్డు ప్రమాదంలో రాంటెక్ వాసి..



జనార్దన్ (ఫైల్)

ముధోల్: మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాంటెక్ వాసి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని రాంటెక్ గ్రామానికి చెందిన కొమురపెల్లి జనార్దన్ (55) మహారాష్ట్రలోని పూణేలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లాడు. శనివారం తిరుగుప్రయాణంలో ప్రైవేటు ట్రావెల్స్‌లో వస్తుండగా పూణే శివారులో మార్గ మధ్యలో హోటల్ వద్ద వాహనాన్ని ఆపారు. అయితే కాలకృత్యాలు తీర్చుకునేందుకు జనార్దన్ రోడ్డు దాటుతుండగా మహారాష్ట్రకు చెందిన వాహనం వెనక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి ఆదివారం స్వగ్రామం రాంటెక్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

అ'పూర్వ' సమ్మేళనం



మంచిర్యాలటౌన్ : జిల్లా కేంద్రంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



దస్తురాబాద్ ప్రభుత్వ పాఠశాలలో చిన్ననాటి స్నేహితులు



లక్ష్మణచాంద: పీచరలో కలిసిన 1996 బ్యాచ్ మిత్రులు

దస్తురాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు మళ్లీ 25 సంవత్సరాల తరువాత ఆదివారం ఒకేచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–1996 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పీచరలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో కలుసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు గాజులు వేసుకుని శుభాకాంక్షలు తెలుపగా పురుషులు శాలువాలు కప్పుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు.

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని సీసీసీ కార్నర్‌లో గల స్వాతి హైస్కూల్‌లో 2006–07 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు జిల్లా కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రిన్సిపాల్ నారాయణరాజు, అధ్యాపకులు మంజుల, మూర్తి, భాను, సత్యం, రవి, రాజ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు.

బతుకమ్మ వేడుకల్లో అపశృతి

- వేర్వేరు చోట్ల అస్వస్థతకు గురై ఇద్దరు మహిళలు మృతి



రుషిత (ఫైల్)



భాగ్యలక్ష్మి (ఫైల్)

భైంసారూరల్: మండలంలోని వానల్‌పహాడ్ గ్రామానికి చెందిన రుషిత (22) శనివారం రాత్రి బతుకమ్మ ఆడుతూ అస్వస్థతకు గురై మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అందరితో కలిసి వేడుకల్లో పాల్గొన్న మహిళ అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు భైంసాలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించేలోగానే మృతి చెందింది.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ కాలనీకి చెందిన బిట్లింగ్ భాగ్యలక్ష్మి (56) శనివారం బతుకమ్మ ఆడుతూ అస్వస్థతకు గురై కుప్పకూలింది. కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. డీజే సౌండ్ కారణంగానే గుండెపోటుకు గురై మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

కుటుంబ తగాదాలతో యువకుడి బలవన్మరణం



బీరేష్ (ఫైల్)

వేమనపల్లి: కుటుంబ తగాదాలతో ఉరేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. నీల్వాయి ఎస్సై కోటేశ్వర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని రాజారం గ్రామంలోని కుర్మగూడెంకు చెందిన దైవాల బీరేష్ (22) తాత మల్లయ్య గతేడాది మృతి చెందగా శనివారం 9 నెలల మాసికం కార్యక్రమం నిర్వహించారు. భోజనాల అనంతరం కుటుంబ సభ్యుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన బీరేష్ సాయంత్రం ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని ఎల్లమ్మ గుట్ట అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. మృతుని తండ్రి మొండి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులోపడి ఒకరు మృతి

ముధోల్: ప్రమాదవశాత్తు చెరువులోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన సయ్యద్ కాశీం అలీ (54) పంటచేను చెరువుపక్కనే ఉంది. ఆదివారం ఉదయమే పొలానికి వెళ్లిన అలీ స్నానం చేసేందుకు చెరువులో దిగడంతో ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

ఒకరిపై పీడీయాక్టు



చర్లపల్లి జైలుకు తరలిస్తున్న సీఐ

ఇచ్చోడ: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన అల్తాపాపై ఆదివారం పీడీయాక్టు కేసు నమోదు చేసినట్లు సీఐ బండారి రాజు తెలిపారు. నిందితుడు గతంలో అటవీ అధికారులు, పోలీసులపై దాడి చేయడంతో ఈ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడిపై ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో 11 కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితుడు కొంతకాలంగా పలు కేసుల్లో ప్రధాన పాత్ర పోషిస్తూ చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని చర్లపెల్లి జైలుకు తరలించినట్లు తెలిపారు.

50 ముఖాల దుర్గామాత నిమజ్జనం



నిమజ్జనానికి తీసుకువచ్చిన దుర్గామాత

బాసర: నిజామాబాద్ జిల్లాలోని వినాయక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన 50 ముఖాలతో ఉన్న అతిపెద్ద దుర్గామాత విగ్రహాన్ని ఆదివారం బాసర గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. మొట్టమొదటి సారిగా 50 ముఖాలతో ఉన్న దుర్గాదేవి అమ్మవారి విగ్రహం నదికి తీసుకురావడంతో తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

వాగులో కొట్టుకుపోయిన ఎడ్లబండి

- ఆవు, ఎద్దు మృతి
- ప్రాణాలతో బయటపడిన రైతు, మరో ఎద్దు



మృతి చెందిన ఎద్దు

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సోమగూడెం పాతబస్తీ శివారులో ఉన్న వాగులో ఎడ్లబండి కొట్టుకు పోయిన ఘటనలో ఆవు, ఎద్దు మృతి చెందగా రైతు, మరో ఎద్దు ప్రాణాలతో బయట పడ్డారు. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లంబాడితండాకు చెందిన బానోత్ బలరాం పెద్దనపల్లి శివారులో పొలం పనులు చేస్తున్నాడు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం పొలం వద్ద ఉన్న ఎడ్లు, ఎడ్లబండిని తీసుకు వచ్చేందుకు కాలినడకన వెళ్లాడు. వెళ్తున్న క్రమంలో వాగు దాటగా మోకాలి లోతులో ఉండటంతో పొలం వద్దకు వెళ్లి ఎడ్లబండి సహా మరో ఆవును బండికి కట్టుకొని బయలు దేరాడు. వెళ్లేటప్పుడు వాగు లోతు తక్కువగా ఉండటంతో అదే నమ్మకంతో చీకట్లో వాగు దాటుతుండగా వరద ఉధృతి పెరిగి ఎడ్లబండి కొట్టుకు పోయింది. ఈక్రమంలో తనకు ఒక చెట్టు కొమ్మ దొరకడంతో పట్టుకుని ఎద్దును ఎడ్లబండి నుంచి వేరు చేసి కాపాడాడు. దీంతో ఎద్దు, మరో ఆవు ఎడ్ల బండితో సహా కొట్టుకు పోయి మృతి చెందాయి. మృతి చెందిన ఎద్దు, ఆవు విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని వాపోయాడు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు

- సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు

చెన్నూర్‌రూరల్: జిల్లాలో మామిడి సాగుపై ఆధారపడి ఎంతోమంది రైతులు జీవిస్తున్నారు. మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన అధికారి కళ్యాణి తెలిపారు. ఇప్పటి నుంచి నాలుగు నెలల కాలం మామిడి పంటకు కీలకమైందని, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

పూతకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

అక్టోబర్ నుంచి మామిడి చెట్లకు నీరుపెట్టడం పూర్తిగా ఆపేయాలి. లేదంటే చెట్టు శాఖీయంగా బాగా పెరగడంతో పాటు పూత రావడం ఆలస్యం అవుతుంది. పూత రావడం అనేది రాత్రి పూట చల్లని వాతావరణం, పగటి పూట ఉన్న ఎక్కువ ఉష్ణోగ్రతలపై ఆధారపడి ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రత కనీసం 13 డిగ్రీల సెంటీగ్రేడ్ చేరుకునేలా కనీసం 15 రోజుల పాటు కొనసాగితే పూత వస్తుంది. వాతావరణ పరిస్థితులు కొమ్మల్లోని హార్మోన్ల నిష్పత్తి కొమ్మకు తగినంత వయసు అనేది పూత రావడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది.

పూత బాగా రావాలంటే..

పూత బాగా రావాలంటే కొత్తగా వచ్చే చిగుర్లపై 5 గ్రాములు జింక్ సల్ఫేట్, 2 గ్రాములు బోరాక్స్, 10 గ్రాముల యూరియాను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

చీడపీడలు ఆశించకుండా..

అక్టోబర్ మాసం నుంచి మామిడి తోటల్లో తేనె మంచు పురుగు, తామర పురుగు, బూడిద తెగులు లేత కొమ్మలను ఆశించి నష్ట పరుస్తాయి. తేనె మంచు పురుగు తల్లి, పిల్ల పురుగు లేత ఆకులు, పూల కొమ్మలపై గుంపులు, గుంపులుగా చేరి రసం పీల్చుతాయి. దీంతో కాడలు, కొమ్మలు మాడి పూత, పిందె ఏర్పడదు. ఒక వేళ ఏర్పడినా బలహీన పడతాయి. దీని నివారణకు ఈ మాసంలో కార్బాలిల్ 3 గ్రాములు, ఆర్బిన్ 1గ్రాము. నువాన్ ఒక మిల్లీ లీటరు, 5 మిల్లీ లీటర్ల వేప నూనె, కార్బండిజమ్ ఒక గ్రాము లేదా మ్యాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి చెట్టు, కాండం కొమ్మల నుంచి ఆకులు తడిసేలా పిచికారీ చేయాలి. తామర పురుగు లేత కొమ్మలను ఆశించి రసంపీల్చడం ద్వారా పూకొమ్మలు రాతి రంగుకుమారి మాడి పోతాయి. నివారణకు రీజెంట్ 2 మిల్లీలీటర్లు, ఎసిఫేట్ 1.5 గ్రాములను లేత కొమ్మలు, ఆకులపై పిచికారీ చేయాలి.

బూడిద తెగులుతో జాగ్రత్త... .

ఈ మాసంలో బూడిద తెగులు పూల కొమ్మలను ఆశించి నష్ట పరుస్తుంది. తెల్లని బూడిద లాంటి పొడి ఆకులు, పూత కాడలపై కనిపిస్తుంది. తెగులు సోకిన భాగాలు నల్లగా మారి ఆకులు, పూల కాడలు సక్రమంగా పెరగవు. ఈ తెగులు వల్ల పంటకు 30 నుంచి 60 శాతం వరకు నష్టం కలుగుతుంది. దీని నివారణకు మూడు గ్రాములు నీటిలో కరిగే గంధకం (సల్ఫర్)ను పువ్వు వచ్చే కాడలు, కొమ్మలు తడిచేలా పిచికారీ చేయాలి. హెక్సాకొనజోల్ మందును 2 మిల్లీ లీటర్లు తీసుకుని లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నవంబర్ నెలలో మామిడి తోటకు బెట్ట పరిస్థితులు కల్పిస్తూ సస్యరక్షణ చర్యలు తీసుకుంటే తోటల్లో అధిక పూత పొందవచ్చు.